ఇరవై అయిదవ గంట

చేస్తున్న పని ఒక్క క్షణం ఆపి శుష్కించిన చేత్తో నుదురు తుడుచుకున్నాడు నరహరి. ఎదురుగా పెద్ద తేనెటీగల తుట్టె ఉన్నట్టున్నది.

చిన్న చిన్న అరలు.... వాటిలో అక్షరాలు.... ఒత్తులు.... కామాలు.... చుక్కలు....

పైన ట్యూబ్‌లైటు వెలుగుతున్నది.

అవతలిపక్క చిన్న గదిలోనుంచి ట్రెడిల్ సవ్వడి నిర్విరామంగా వినబడుతున్నది.

నరహరి మళ్ళీ పనికి ఉపక్రమించాడు. కుడిచేయి చకచక కదులుతున్నది. వేగంగా అక్షరాలు మాటలుగా రూపొందుతున్నాయి. అతనికి సరిగ్గా వెనక అలాటి పనిలోనే నిమగ్నుడైవున్నాడు సుబ్బరాజు. అతను చిన్నవాడు. పాతికలోపే వయసు.... పుట్టిపెరిగిన వూరువిడిచి, కడుపు చేత్తో పట్టుకుని యీ నగరానికి వచ్చాడు. ప్రెస్‌లో చేరి పని నేర్చుకుని, కంపోజింగ్‌లో నిష్ణాతుడై సంపాదిస్తూ ముసలి తల్లిదండ్రులకు కొంత డబ్బు పంపిస్తూ ఒంటరిగా బ్రతుకుతున్నాడు.

నరహరి వెనుదిరిగి కళ్ళజోడు క్రింద నుంచి సుబ్బరాజు వంక చూశాడు. అతనికి జాలివేసింది. 'ఈ కుర్రవాడు తన కోసం ఎంత శ్రమ పడుతున్నాడు' అనిపించింది.

ఇప్పటికి సరిగా మూడుపగళ్ళూ మూడు రాత్రులూ విరామం అనేది ఎరుగరు ముగ్గురూ.... అప్పుడప్పుడు బైటికి వెళ్ళి ఏదన్నా తిని, టీ నీళ్ళు తాగడమే.... మధ్య మధ్యలో చిన్న చిన్న కునుకులు తప్ప నిద్రలేదు.

రాత్రి పదిగంటలవుతూ వుండవచ్చు. ముందువైపు ప్రెస్ యజమాని గదిలో లైటు వెలుగుతున్నది. ఆయన మధ్యవయసువాడు. అతి శ్రద్ధగా ప్రూఫులు దిద్దుతున్నాడు.

బుచ్చి - ఎనిమిదేళ్ళ పసివెధవ. మాసిన లాగూ చొక్కాతో యజమాని గది గుమ్మం ముందు స్టూలుమీద గోడకానుకుని కూర్చుని కునికిపాట్లు పడుతున్నాడు.

లోపల ట్రెడిల్ శబ్దం ఆగింది. రుమాలుతో మొహం తుడుచుకుంటూ ఇవతలికి వచ్చాడు నారాయణ. గుమ్మంలో నిలబడి "ఫారం సిద్ధమేనా?" అని అడిగాడు నరహరిని.

"ఆఁ! అదుగో స్టోన్‌మీద" అన్నాడు నరహరి.

నారాయణ "వస్తానిప్పుడే" అంటూ బయటికి నడిచాడు.

ప్రెస్ యజమాని "నారాయణా! ఇలారా" అని పిలిచాడు.

"ఇదుగో చూడు. ఆఖరి ఫారం, ఇన్నర్ టైటిల్.... ఒక వంద కొట్టుచాలు. మిగతా పని తర్వాత చేసుకోవచ్చు మెల్లిగా...." అన్నాడు.

నారాయణ 'అలాగేనండి' అని బైటికి నడిచాడు. చల్లని గాలితెర వీచింది. వీధి మూలవున్న టీ దుకాణం దగ్గర పెట్రొమాక్సులైటు మందంగా వెలుగుతున్నది. నారాయణ అక్కడికి వెళ్ళి బల్లమీద కూలబడి "వెంకులూ! టీ యివ్వు" అన్నాడు. అతనికి కాళ్ళు తేలిపోతున్నాయి. చేతులు రెండూ గాల్లోకి అటూ యిటూ విసిరి వ్రేళ్ళు విరుచుకున్నాడు. ఇంత ఘోరంగా రోజుల తరబడి నిర్విరామంగా ఎన్నడూ పనిచేయలేదు. చేయవలసిన అవసరం కూడా రాలేదు. తాము చేస్తున్నది కాంట్రాక్టు పని. కష్టపడినంతసేపు

కష్టపడితేచాలు.... ఉన్నది తాము మొగుడూ పెళ్ళాలిద్దరు. తిండికి, బట్టకు లోపం లేకుండా కాలం వెళ్ళిపోతే చాలు. అలాటిది నరహరి గొప్ప అవసరం వచ్చి ప్రాధేయపడితే తానూ సుబ్బరాజూ యిద్దరూ కాదనలేకపోయారు. ఈ రోజుల్లో ఎవరు ఎవరికి యిబ్బందిలో అడ్డుపడతారు? కాని యిలా మరొకరి కోసం శ్రమపడుతుంటే ఇందులోనూ వింత ఆనందం ఉన్నదనిపిస్తుంది.

నారాయణ టీ తాగడం ముగించి చిల్లర చెల్లించి ప్రెస్‌లోకి వచ్చేసరికి ప్రెస్ యజమాని గదిలో ఆయన కెదురుగా ఇద్దరు ఖరీదైన వ్యక్తులు కూర్చుని వున్నారు. ప్రెస్‌ముందు రంగుల హంసలాటి కారు నిలిచివుంది. బుచ్చి నిద్ర మైకం వొదిలిపోయి చేతులు కట్టుకుని నిలబడి వున్నాడు.

నారాయణ లోపలికి వెళ్ళి కొత్తఫారం ట్రెడిల్ మీదికి ఎక్కించే పనిలో నిమగ్నుడైనాడు.

ప్రెస్ యజమాని "నన్ను నమ్మండి.... ఉదయం పది గంటల కల్లా కనీసం యాభై కాపీలు నేను స్వయంగా హాలు దగ్గరికి పట్టుకొస్తాను" అంటున్నాడు.

ఒకడు బొంగురు గొంతుకతో "కాబట్టే మీకు పని యిచ్చాను.... డబ్బెక్కువైనా సరే నేను లెక్కచెయ్యను. నాకు పనికావడం ముఖ్యం.... అందులోనూ ఫంక్షన్ ఏర్పాటయింది.... ముగ్గురు మంత్రులొక్కసారిగా దొరికారు.... అలాంటిలాంటి ఫంక్షన్‌కాదు - బ్రహ్మాండమైన ఫంక్షన్. ఊరంతా మోగిపోవాలి.... అదీ సంగతి" అని ఆగి, "కుర్రాడేడీ?" అని ప్రశ్నించాడు. ప్రెస్ యజమాని వెంటనే "ఏం కావాలి?" అంటూనే "బుచ్చీ" అని కేకవేశాడు.

బుచ్చి లోపలికి వెళ్ళి నిలబడ్డాడు.

బొంగురు గొంతు వ్యక్తి పక్క అతనితో "ఎంత తెప్పించను? హాఫ్....చాలా?" అన్నాడు. రెండో వ్యక్తి టెరిలిన్ లాల్చీ, బంగారు గొలుసు, వగైరాలతో తళతళ లాడుతున్నాడు. అతడు "చాలు.... చాలు హాఫ్ చాలు" అన్నాడు.

మొదటి వ్యక్తి యాభై రూపాయలు నోటుతీసి బుచ్చికి అందించి "రేయ్! రోడ్డుమీద బ్రాందిషాపుకెళ్ళి.... ఇదుగో.... ఈ కాయితంలో రాసింది పట్టుకురా.... అర్జంటు...." అంటూ కాయితం ముక్క మీద తమకు కావలసిన బ్రాందు పేరు వ్రాసియిచ్చాడు. బుచ్చి దాన్ని అందుకుని వెళ్ళిపోయిన తర్వాత ప్రెస్ యజమానివైపు తిరిగి "మీరు కూడా పుచ్చుకుంటారా?" అని అడిగాడు.

ఆయన తల అడ్డంగా వూపి "వొద్దొద్దు! మీరు కానివ్వండి" అన్నాడు కంగారుగా.

నిజానికి అది ప్రెస్ యజమానికి అసలు యిష్టంలేదు. ప్రెస్‌లో, అందునా తన గదిలో.... పనివాళ్ళముందు.... ఇతరులు ఆ పనిచేయడం మరింత అసహ్యామైన విషయం. కాని యిప్పటి పరిస్థితి వేరు.... ఆయన నెత్తిమీద పెద్ద కత్తి వ్రేలాడుతున్నట్టున్నది వారం, పదిరోజుల నుంచీ, మరునాడు మధ్యాహ్నం కోర్టు ముగిసే వేళలోగా అయిదువేల రూపాయలు కట్టకపోతే పెద్ద ప్రమాదం ముంచుకు వస్తుంది. వీళ్లు తనకు తెలిసిన వాళ్లే.... పాత కష్టమర్లే....ఇప్పుడు తనకు హడావిడిగా ఈ పెద్ద నవల ముద్రణకు యిచ్చి గొంతుమీద కూర్చుంటే కూర్చున్నారు గాని తన ఆపద గడుస్తున్నది. అందువల్ల ఇలాటి స్వల్ప విషయానికి అభ్యంతరం చెప్పడం తెలివి తక్కువ. సహించడం ఉత్తమం.

లోపల సుబ్బరాజు నరహరితో "ఈ పేరాతో ఖతం.... పని పూర్తయినట్టే...." అన్నాడు వొళ్లు విరుచుకుంటూ....

నరహరి అతనివంక చూశాడు. అతని కళ్ళలో కృతజ్ఞత నీటి పొర రూపంలో పేరుకున్నది. అంతలో కళ్లు తుడుచుకుని తన పనిలో లీనమైనాడు. అతని వ్రేళ్లు వొణుకుతున్నాయి.

....ఇంటి దగ్గర తమ్ముడు కళ్లలో వత్తులు వేసుకుని ఎదురుచూస్తూ వుంటాడు. మీనాక్షి కూడా కంగారుపడుతూ వుంటుంది. బహుశా మరిది సంచి సర్ది అంతా సిద్ధంచేసి వుంటుంది. బోలెడన్ని జాగ్రత్తలు కూడా చెప్పి వుంటుంది... రెండు రోజుల నుంచీ యింటిమొహం చూడలేదు తాను.... సరిగ్గా సమయానికి డబ్బు తీసుకువస్తానని చెప్పి రావడమే....

సుబ్బరాజు నెమ్మదిగా "అబ్బ! ఏం నవలయ్యా యిదీ! అంతా క్రిందకి పేర్చుకుంటూ పోవడమే.... ఒక్కొక్క అక్షరం ఒక్కొక్క లైను.... పేజీల నిండి 'ఊ:'లూ, 'ఆ:'లూ.... చుక్కలూ.... ఇంతే అంతానూ.... పని మహా సుఖంగా వుందిలే.... పేజీకి అడ్డంగా వాక్యం కంపోజ్ చేసే పనేలేదు.... అన్నట్టు హీరోయిన్.... యిప్పుడు రక్తం కక్కుకుని చచ్చిపోతున్నది. పేరు 'డాక్టరు బధిర'ట.... అంటే ఏమిటో నీకు తెలుసా?" అన్నాడు.

నరహరికి ఏం జవాబు చెప్పాలో తెలియలేదు. ఉన్నట్టుండి "ఏమయితే మనకెందుకు?" అని వూరుకున్నాడు.

"అంతేలే - మనకెందుకు? కళ్లు మూసుకుని పనిచేయడమే."

అంతలో బుచ్చి తూలుతున్నవాడిలా చేతిలో సీసా పట్టుకుని మరో చేతిలో చిల్లరతో వచ్చాడు.

బొంగురు గొంతు వ్యక్తి చిల్లర అందుకుని "ఏరా కుర్రనాయాలా! రెండు రూపాయలు ఎక్కువ తీసుకున్నాడే షాపువాడు.... వాడు తీసుకున్నాడా లేకపోతే నువ్వే దొబ్బేశావా?" అన్నాడు పెద్దగా.

బుచ్చి గడగడలాడిపోతూ "లేదండీ అంతే యిచ్చాడు...." అన్నాడు.

"అయితే వెళ్ళి రసీదు పట్టుకురా వెధవా."

సిల్కులాల్చీ వ్యక్తి కలగజేసుకుని "పోన్లేరా. పాపం.... మళ్ళీ పసివాణ్ణి ఎందుకు తరుముతావు....? వూరుకో...." అన్నాడు.

బొంగురు గొంతు వ్యక్తి నవ్వి "నువ్వెప్పుడూ యింతే.... ఏదీ లెక్కలేదు నీకు" అంటూ ప్రెస్ యజమాని వంక తిరిగి "గురువుగారూ! రెండు గ్లాసులు.... మంచినీళ్ళూ...." అన్నాడు.

బుచ్చి గ్లాసులు కడుక్కునివచ్చి బల్లమీద పెట్టాడు. కూజా నీళ్లు ప్రక్కన పెట్టాడు. ప్రెస్ యజమాని కుర్చీలో వెనక్కు ఆనుకుని కూర్చున్నాడు.

బొంగురు గొంతు వ్యక్తి తనపనిలో తానుండగా సిల్కులాల్చీ వ్యక్తి జేబులోనుంచి నోట్లకట్ట తీసి బల్లమీద వుంచి "ఇది ఆరువేలు" అన్నాడు.

ప్రెస్ యజమాని దాన్ని అందుకుని 'థ్యాంక్స్...రశీదు రాస్తాను, అన్నాడు.

బొంగురు గొంతు వ్యక్తి "మాకు అవేవీ అవసరంలేదు. పని కావడం మాకు ముఖ్యం.... అంతే.... రేపు ఫంక్షన్...." అంటూ సిల్కులాల్చీ వ్యక్తికి గ్లాసు అందించి 'ఛీర్స్' అని ఒక గుటకవేసి మళ్ళీ 'రేపు ఫంక్షన్ అదిరిపోవాలి. ఇదే సామాన్యమైన ఫంక్షనా? ముగ్గురు మంత్రులు... ఇంకా పెద్ద పెద్ద వాళ్ళు.... వూరంతా దడదడలాడి పోవాలి. మా వాడి భార్య.... మా చెల్లెమ్మ.... మహా రచయిత్రి.... రెండువందలవ నవల ఆవిష్కరణ.... అసలు అదికాదు ముఖ్యం.... మూడేళ్ళలో రెండు వందల నవలలు రాయడం అంటే అది టెరిబుల్ ఫీట్.... అచివ్‌మెంట్, వరల్డ్ రికార్డు.... పత్రికవాళ్ళు ఆలిండియా పబ్లిసిటీ యిస్తారు. వరల్డంతా మోగిపోతుంది" అంటూ ఆపకుండా మాట్లాడటం సాగించాడు.

బుచ్చి కళ్ళింతలు చేసుకుని చూస్తూ స్టూలుమీద కూర్చునివున్నాడు. ప్రెస్ యజమాని ముఖం ఇప్పుడు కళకళ లాడుతున్నది. గొప్ప భరోసాతో ఎదుటి వ్యక్తి మాటలు వింటున్నాడు.

లోపల సుబ్బరాజు నిట్టూరుస్తూ పక్కనే కూర్చుని వున్నాడు. నరహరి ఇన్నర్ టైటిల్ ఫారం కొట్టడం పూర్తి అయింది. అందులో ముందుమాటలు, అంకితం, ఫోటో బ్లాకులు వగైరాలున్నాయి. అది మెషిను కెక్కితే నారాయణ మరో అరగంటలో పని పూర్తిచేస్తాడు. బహుశా అప్పటికి పన్నెండు దాటుతుందేమో! తమ్ముడికి మూడు గంటలకు రైలు.... వాడు వందలాది మైళ్ళు ప్రయాణం చేసి రెండో రోజుకు ఇంటర్వ్యూకు అందుకోవాలి.... ఇంటిదగ్గర వదినా మరుదులిద్దరూ ఎంత కంగారు పడుతున్నారో!

తమ్ముడు తన తల్లీ తండ్రీ పోయేనాటికి పసివాడు.... తల్లి ఆ పసివాణ్ణి తన భార్యకప్పగించి "వీడికి తల్లివైనా వొదినవైనా నువ్వే తల్లీ' అని చెప్పి కన్ను మూసింది. అప్పటినుంచి తామిద్దరూ కన్నకొడుకులాగే - నిజానికి అంతకంటే మిన్నగా - పెంచి పెద్ద చేశారు. వాడు కూడా ఈ కాలపు కుర్రవాళ్ళకుమల్లే కాదు. గొప్ప బుద్ధిమంతుడనే చెప్పాలి. బాధ్యత ఎరిగి బుద్ధిగా చదువుకుని ఈనాటికి ఇంత యోగ్యుడైనాడు. దేవుడి దయవల్ల అంతా సవ్యంగా జరిగి వాడికి ఈ ఉద్యోగం వస్తే అంతకంటె కోరుకోదగింది ఏమీలేదు.

ప్రెస్ యజమాని నాలుగు రోజుల క్రిందట అసలు ఇంత పని ఒప్పుకుని ఉండేవాడు కాదు. ఆయనకు ఏదో కోర్టు వ్యవహారం పీకలమీదికి వచ్చింది. తమ్ముడికి అంతదూరం నుంచి ఇంటర్వ్యూకు పిలుపు రాగానే "ఎలారా దేవుడా' అని కంగారుపడుతున్న తనను పిలిచి అంతా చెప్పి 'ఇదీపని.... మాట యిచ్చామంటే చేసితీరాలి.... మామూలు కాంట్రాక్టు రేటుకంటే ఎక్కువిస్తాను. ఏమంటారు? ఒప్పుకోనా?' అని అడిగితే, సుబ్బరాజు నారాయణ యిద్దరితో తనబాధ చెప్పుకుని సాయం చెయ్యమని కోరాడు తాను. వాళ్ళిద్దరూ వెంటనే ఒప్పుకున్నారు. ఒప్పుకోడం అంటే అసాధ్యమైన పనిని ఒప్పుకోడం.... మూడు రోజులు.... అంటే డెబ్బయి రెండుగంటలు....నిద్రాహారాలు త్యజించి పనిచేయడానికి సిద్ధపడటం.... కాలగమన వేగంతో పోటీపడటం.... పోటీ పడటమేకాదు.... అధిగమించడం.... వాళ్ళు చేసిన సాయం మామూలు సాయం కాదు. డబ్బు అయితే తాను తీర్చేయగలడు.... కాని వారు చిందించిన స్వేదానికి, రక్తానికి బదులు ఏమివ్వగలడు తాను?

బయటి గదిలో ఆ యిద్దరు వ్యక్తులూ లేచారు. ప్రెస్ యజమానికి షేక్‌హాండ్ యిచ్చారు.

"పది గంటలకల్లా...."

"హాలు దగ్గరికి...."

"యాభై కాపీలు చాలు...."

అని మాటి మాటికీ హెచ్చరిస్తూ నడిచారు.

ప్రెస్ యజమాని వారిని సాగనంపి లోపలికి వచ్చాడు. "ఎంతలో వుంది" అన్నాడు వొస్తూనే.

"ఇదిగో! ఇన్నర్ టైటిల్ ట్రెడిల్ ఎక్కింది"

ప్రెస్ యజమాని తేలికగా నిట్టూర్చి "నారాయణా! ఒక వంద వెయ్యిచాలు" అన్నాడు.

మిగిలిన ప్రింటయిన ఫారాలన్నీ కలపడం పూర్తయింది. టైటిల్ సిద్ధంగా వుంది. ఇక ముందూ వెనకా ఈ ఫారాలు చేర్చి, పిన్నింగ్‌చేసి, టైటిల్‌వేసి, కటింగ్ చేయడమే. ఈ పనంతా ఉదయం బైండర్ వచ్చి గంటలో లాగించెయ్యగలడు.

"నరహరి! మీరు వెళ్ళేటప్పుడు ఈ బుచ్చిగాణ్ణి కూడా తీసుకువెళ్ళి వాళ్ళ యింటిదగ్గర దింపండి. ఒక పాతిక రూపాయలిస్తాను. వాళ్ళ అమ్మకు ఇవ్వండి" అన్నాడు ప్రెస్ యజమాని.

లోపల ట్రెడిల్ చప్పుడు.... ఇన్నర్ టైటిల్ ప్రింటవుతున్నది అక్కడే ఇరుకు గుమ్మంలో ఒక పక్కన నరహరీ, మరోపక్క సుబ్బరాజూ నిలబడి చూస్తున్నారు. నారాయణ అతి చాకచక్యంగా పనిచేస్తున్నాడు. అతడెప్పుడూ ఏమీ మాట్లాడడు. ఎప్పుడూ తనపనేమో.... తానేమో.... మహా నిపుణుడైన ట్రెడిల్‌మన్.

"అసలు తెలుగులో ముద్రణ ఇంత యాతనామయంగా ఎందుకుండాలి? ఇతర రంగాలలో ఎంతెంత మార్పులొస్తున్నాయి." అనుకున్నాడు నరహరి చొక్కా వేసుకుంటూ.

నారాయణ మెషిన్ ఆపి ప్రింటయిన ఫారాలు దింపి క్రిందపడేసి చేతులు తుడుచుకున్నాడు. లైటు తీసేశాడు. చొక్కా తొడుక్కున్నాడు.

ముగ్గురూ యివతలికి వచ్చారు. ప్రెస్ యజమాని వారిని లోపలికి పిలిచి ఎవరి డబ్బు వారికి అందించాడు.

"చాలా పొద్దుపోయింది. కుర్రవెధవను యింటి దగ్గర దింపండి. కునుకుతున్నాడు. నేను తాళాలు వేస్తాను. అన్నట్లు రాజూ! ఈ సీసావీధిలో పారెయ్."

రాజు ఖాళీసీసా అందుకుని వీధి అవతలి వైపుకు చీకట్లోకి విస్సిరికొట్టాడు. అది ఎదురుగోడకు తగిలి భళ్ళున బ్రద్దలైంది.

ముగ్గురూ బుచ్చిని వెంటబెట్టుకుని వీధిలోకి వచ్చారు. వీధి చివర వరకూ వెలుగునీడలు పరుచుకుని వున్నాయి. ఆ నిశ్శబ్దంలో ఏదో పక్షి వికృతంగా అరుస్తూ ఎగిరిపోయింది.

బుచ్చిని ఇంటిదగ్గర తల్లికి అప్పగించి, ఆమెకు డబ్బు యిచ్చి మళ్ళీ నడక ప్రారంభించారు. నారాయణ, సుబ్బరాజు, తమ డబ్బు నరహరికి అందించారు. నరహరి కళ్ళనీళ్ళు ఉబికి వస్తూవుండగా డబ్బు అందుకుని తొందరలో తీర్చేస్తాను అని గొణిగాడు.

నారాయణ మనసులో తృప్తి.... సుబ్బరాజు మనసులో ఏదో తెలియని ఆనందం.... తమ తమ్ముణ్ణి ఉద్యోగానికి పంపిస్తున్నట్టు వింత అనుభూతి ఇద్దరిలోనూ.

ముగ్గురూ వెళ్ళేసరికి నరహరి తమ్ముడు ఆదుర్దాగా ఎదురువచ్చి "ఇంత ఆలస్యమైందేం అన్నయ్యా?" అన్నాడు.

మీనాక్షి కూడా ఆ చిన్న పెంకుటింటి వరండాలోనే నిలబడివుంది. ఆమె భర్తను చూసి తేలికగా నిట్టూర్చింది.

నరహరి "ఇదిగో డబ్బు. వదిన చేతుల మీదుగా అందుకో" అన్నాడు భార్యకు అందిస్తూ.

మీనాక్షి అలసటగా నవ్వుతూ 'మీరే ఇవ్వరాదూ?" అన్నది.

"కాదులే.... నీ చేతుల మీదుగా యిస్తే శుభమవుతుంది. నాలుగో రోజుకు ఉద్యోగంలో చేరానని ఉత్తరం రాస్తాడు మరిదిగారు."

సుబ్బరాజు "ఉత్తరం వద్దు.... టెలిగ్రామ్ బెటరు" అన్నాడు. అందరూ నవ్వారు. మీనాక్షి చీర చెంగుతో దగ్గు ఆపుకుంది. ఆమె చేతి నుంచి డబ్బు అందుకుని వంగి కాళ్ళకు నమస్కరించాడు మరిది.

స్టేషనులో రైలు సిద్ధంగా ఉంది. అన్‌సీజన్ కావడంచేత రైలు మరీ రద్దీగా లేదు. ఒక సీటులో సంచీ ఉంచి తమ్ముడికి ఏవేవో జాగ్రత్తలు చెబుతున్న నరహరివంక కన్నార్పకుండా చూస్తున్నారు మిగిలిన యిద్దరూ. వున్నట్టుండి ఆ అబ్బాయి వంగి అన్న పాదాలకు నమస్కరించాడు.

రైలు కదిలింది. ముగ్గురూ చేతులూపుతూ వుండగా వేగం పుంజుకుని అంతలోనే ప్లాట్‌ఫారం దాటి కనుమరుగై పోయింది.

కళ్ళనీళ్ళు పెట్టుకుని అలాగే నిలబడిపోయిన నరహరిని వీపుమీద తట్టి "రావయ్యా! మహానుభావా! బైట 'టీ' అయినా ఇప్పించు" అన్నాడు నారాయణ.

"టీ ఏమిటి? బిస్కట్లు కూడా కావాలి" అన్నాడు సుబ్బరాజు.

స్టేషను వెలుపల చల్లని గాలి వీస్తున్నది. మూల కాకా హోటల్లో ముగ్గురూ బిస్కట్లు తింటూ, టీ తాగుతూ కూర్చున్నారు నిశ్శబ్దంగా.

"ఈ కుర్రవాడికి ఉద్యోగం వస్తుందా అసలు...."

నారాయణ మనసులో మెదులుతున్న ప్రశ్న.

"ఈ ఉద్యోగం వచ్చాక ఇంతోటి మరిదిగారు అన్నా వదినెలను ఆదుకుంటాడా? వదిన టి.బి. చికిత్సకోసం డబ్బు సాయం చేస్తాడా? లేక మరచిపోతాడా?"

సుబ్బరాజు మనసులో అనుమానం....

"వీడికి ఉద్యోగం వచ్చి తీరుతుంది. ఇంట్లో వదినకు దణ్ణం పెట్టాడు. స్టేషన్‌లో నా కాళ్ళకు దణ్ణం పెట్టాడు. ఉద్యోగంలో చేరగానే మాకు అండగా నిలుస్తాడు. అన్నిటికంటె ముందు మీనాక్షికి మందుల కోసం డబ్బు పంపిస్తాడు. మీనాక్షికి టి.బి. తగ్గుతుంది.

నరహరి మనసులో ఆశ....

తర్వాత పది నిముషాల్లో ఎవరి ఇళ్ళకు వారు వెళ్ళిపోయారు.

మరునాడు....

ఫంక్షన్...: ఫెళ్లున జరిగింది. రంగ రంగ వైభవంగా జరిగింది. మూడేళ్ళ స్వల్ప వ్యవధిలో రెండువందల నవలలు రాసిన మహా రచయిత్రిని అందరూ పొగడ్తల వర్షంలో ముంచెత్తారు. మంత్రులూ, అధికారులూ, మాన్యులు, అసామాన్యులు, వందిమాగధులు, ఖరీదైన కార్లు, పొగడ్తలు, ఉత్ప్రేక్షలు, చదివింపులు, దండలు, ఫోటోలు, అంతా కళ్లు మిరుమిట్లు గొలిపేట్లు జరిగింది.

మహా రచయిత్రి, ఆ రాత్రి డిన్నరూ వగైరా ముగిసి అందరూ వెళ్ళిపోయాక గాఢంగా నిట్టూర్చి భర్తతో దిగులుగా బాధగా "ఇవాళ ఒక్క అక్షరం కూడా రాయలేదు. రోజంతా వేస్ట్ అయిపోయింది" అన్నది.

ఆ తర్వాత హడావిడిగా పూనకం వచ్చినదానిలా వెళ్లి బల్లముందు కూర్చుని కాయితాలు ముందుకు లాక్కుని ఒక్క క్షణం కలాన్ని పళ్ళ మధ్య వుంచుకుని ఆలోచించి....

"ట్రింగ్....ట్రింగ్...."

ఫోన్ గణ గణ మని మోగింది.

అంటూ తన రెండు వందల ఒకటవ నవల ప్రారంభించింది....

◆ ◆ ◆